బోనాల చెక్కుల పంపిణీ రసాభాస

- రెండు గంటలు ఆలస్యంగా వచ్చిన ఎంపీ
- వెనుదిరిగి వెళ్లిపోయిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాల చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఐదు నిమిషాల్లో వస్తానని చెప్పి రెండు గంటలు ఆలస్యంగా రావడంతో ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆగ్రహ వ్యక్తం చేస్తూ వెనుదిరిగి వెళ్లిపోయారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం 201 దేవాలయాలకు రూ. 1,07,60,500 విడుదల చేసింది. ఆలయాల కమిటీ నిర్వాహకులకు చెక్కులు అందజేసేందుకు గురువారం భోలక్‌పూర్‌లోని భవానీ శంకర దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమం బోనాల ఉత్సవాల ఇన్‌చార్జి సత్యనారాయణ పర్యవేక్షణలో కొనసాగింది. ఉదయం 10 గంటలకు రావాలని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లకు అధికారులు సమాచారం ఇచ్చారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, ముషీరాబాద్ తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, ఆలయ కమిటీ నిర్వాహకులు, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు వేదిక వద్దకు చేరుకున్నారు. ఎంపీ రాకపోవడంతో ఫోన్ చేయగా అరగంటలో వస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే స్వయంగా ఎంపీకి ఫోన్ చేయగా వస్తున్నానని చెప్పారు. రెండు గంటలు అయినా ఆయన రాకపోవడంతో ఎమ్మెల్యే గోపాల్ దేవాదాయ శాఖ అధికారులను నిలదీశారు. తాను కొన్ని చెక్కులు పంపిణీ చేసి వెళ్తానన్నారు. ఎంపీ వస్తున్నారని, కొద్దిసేపు వేచి ఉండమని అధికారులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేయగా వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నాయకులు చెక్కుల పంపిణీ ఇన్‌చార్జి సత్యనారాయణతో వాగ్వాదానికి దిగారు. ఇది కాంగ్రెస్‌పార్టీ కార్యక్రమమా, బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమమా.. ఎమ్మెల్యేకు మీరు గౌరవం ఇవ్వరా.. ఎమ్మెల్యే ఎంతసేపు వేచి ఉంటారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వెళ్లిపోతుండగా.. బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ ఆయన వెంట వెళ్లిపోయారు. కార్యక్రమంలో భవానీ శంకర ఆలయ కమిటీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు మేడి సురేష్‌కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు సంగపాక వెంకట్, మధు, రాష్ట్ర నాయకుడు డి. వెంకటేష్, మాజీ కార్పొరేటర్ వాజీద్ హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, ఆరు డివిజన్ల అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డి, వై.శ్రీనివాస్‌రావు, రాకేష్ కుమార్, శంకర్‌ముదిరాజ్, బల్లా శ్రీనివాస్‌రెడ్డి, వల్లాల శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.


దేవాదాయశాఖ అధికారులతో వాగ్వాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, కార్పొరేటర్ రచనశ్రీ, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్


వెనుదిరిగి వెళ్లిపోతున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, బీఆర్ఎస్ నేతలు

ఇతర కార్యక్రమాల వల్ల ఆలస్యం అయింది

తాను ఉద్దేశపూర్వకంగా ఆలస్యంగా రాలేదు. ఇతర కార్యక్రమాల వల్ల ఆలస్యం అయింది. ఎమ్మెల్యే ముఠా గోపాల్ అంటే గౌరవం ఉంది. ఆయన నాకు అన్నలాంటి వారు. ఫోన్‌లో మాట్లాడి జరిగిన విషయం చెబుతానన్నారు. బోనాల ఉత్సవాలను రాజకీయం చేయొద్దు.

- అనిల్‌కుమార్ యాదవ్, ఎంపీ

రెండు గంటలకు పైగా వేచి చూశా

చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరై రెండు గంటలకు పైగా వేచి చూశా. స్వయంగా ఎంపీకి ఫోన్ చేస్తే అరగంటలో వస్తానన్నారు. రాకపోవడంతో దేవాదాయ శాఖ అధికారులతో ఫోన్ మాట్లాడిస్తే ఐదు నిమిషాల్లో వస్తానని రెండు గంటలైనా ఎంపీ రాకపోవడంతో వేరే కార్యక్రమాలు ఉండడంతో వెళ్లిపోయాను. కావాలనే ఎంపీ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చారు.

- ముఠా గోపాల్, ఎమ్మెల్యే

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఆజామాబాద్ ఏడీఈ నాగేశ్వర్‌రావు తెలిపారు. అంబర్‌పేట పరిధిలోని ఎంసీహెచ్ కాలనీ, ఆకాశ్‌నగర్ తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు, ప్లేగ్రౌండ్ పరిధిలోని ఎరుకల బస్తీ, గాంధీ విగ్రహం తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటలవరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

వీవీ గిరినగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించండి

- అధికారులకు ఎమ్మెల్యే ఆదేశం

చిక్కడపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని వీవీ గిరినగర్‌లో తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ వాటర్ బోర్డు అధికారులను ఆదేశించారు. లోప్రెషర్, కలుషిత నీటి సమస్యపై ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం బస్తీలో ఎమ్మెల్యే పర్యటించారు. సమస్యను పరిష్కరించాలని వాటర్ బోర్డు డీజీఎం కార్తీక్‌రెడ్డి, మేనేజర్ కృష్ణమోహన్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, నాయకులు వున్న సత్యనారాయణ, ఆకుల శ్రీనివాస్, ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


కుల వృత్తుల సంఘాల నాయకులను సన్మానిస్తున్న పూస రాజు

గురువులను పూజించటం నేటి తరానికి తెలియజేయాలి

రాంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గురువులను పూజించే భారతీయ సంస్కృతిని నేటి తరానికి తెలియజేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పూస రాజు అన్నారు. గురుపౌర్ణమిని పురస్కరించుకొని వివిధ వృత్తులకు చెందిన నాయకులను బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పాశం సాయికృష్ణయాదవ్ ఆధ్వర్యంలో రాంనగర్ గుండు చౌరస్తాలో గురువారం సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పూస రాజు మాట్లాడుతూ గురువులను మరిచిపోవద్దన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రామ్, ఓబీసీ మోర్చా ముషీరాబాద్ కన్వీనర్ ఉమేష్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆర్.శేషసాయి, నాయకులు సుబ్రహ్మణ్యంబాబు, కౌండిన్యప్రసాద్, దర్గ నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు

బర్కత్‌పుర, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంపునకు చర్యలు తీసుకుంటున్నామని ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ బద్రసేన్ తెలిపారు. గురువారం కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి విద్యార్థులు, అధ్యాపకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేటు కళాశాలలకు దీటుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అధ్యాపకులు విద్యాబోధనలో నూతన పద్ధతులను పాటించాలన్నారు. విషయ పరిజ్ఞానంతో రూపొందించిన చిత్రం ద్వారా విద్యాబోధన చేయాలన్నారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు డిప్యూటీ సెక్రటరీ ఆనంద్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ. చిరంజీవి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.


జలమండలి మేనేజర్ సుప్రజను సత్కరించిన వినాయకనగర్ బస్తీవాసులు

కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

కవాడిగూడ, జూలై 10 (ఆంధ్రజ్యోతి): వినాయక్‌నగర్ బస్తీలో కలుషిత నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని జలమండలి దోమలగూడ మేనేజర్ సుప్రజ అన్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు గురువారం బస్తీని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా సుప్రజను బస్తీవాసులు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పి.పరశురాం, రామ్‌లాల్, ఆనంద్, ప్రవీణ్, సోనూ శివ తదితరులు పాల్గొన్నారు.


రాంనగర్‌లో విద్యుత్ సమస్యలను పరిశీలిస్తున్న ఎస్ఈ సాయిబాబా, సీఈ వెంకన్న, డీఈ కమాల్‌కుమార్

విద్యుత్ సరఫరాలో సమస్యలు లేకుండా చర్యలు తీసుకోండి

రాంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బోనాల పండగ సందర్భంగా ఆజామాబాద్ పరిధిలో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఈ సాయిబాబా అధికారులకు సూచించారు. గురువారం రాంనగర్, ముషీరాబాద్, బాకారం తదితర ప్రాంతాలలో సూపరింటెండెంట్ ఇంజనీర్ సెంట్రల్ సర్కిల్ వెంకన్న, ఆజామాబాద్ డీఈ కమాల్‌కుమార్, ఆజామాబాద్ ఏడీఈ ఎం.వినోద్‌కుమార్‌లతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ ప్రమాదాలు జరగకుండా ఆలయాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్రాన్స్‌కో ఏఈలు సునీల్, సుధామా పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలి

ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. గురువారం గురుపౌర్ణమి సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి. శ్రీధర్‌చారి ఆధ్వర్యంలో సద్గురు సాయినాథుడికి సామూహిక పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆయన సతీమణి సరోజ, కార్పొరేటర్ సుప్రియా నవీన్‌గౌడ్ ప్రత్యేక పూజలు, నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులను శ్రీధర్‌చారి సన్మానించారు. బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి, నాయకులు ముఠా జైసింహ, శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్ హౌస్‌శ్రీనివాస్, రామకృష్ణ, సదా, బాలరాజు తదితరులు పాల్గొన్నారు. భోలక్‌పూర్ సంజీవయ్య నగర్‌లో సద్గురు సాయినాథ్ ఆలయంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

చిక్కడపల్లి: గురుపౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని గురువారం బాగ్‌లింగంపల్లిలోగల సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక వైస్ చైర్మన్ పి. గంగారెడ్డి, ప్రధానకార్యదర్శి ఎన్. ధర్మరాజుగౌడ్ పర్యవేక్షణలో చందనాభిషేకం, సామూహిక సాయివ్రతం, మూడువేల మంది భక్తులకు అన్నదానం, పల్లకీసేవ జరిగాయి. ఎమ్మెల్యే ముఠా గోపాల్ పూజల్లో పాల్గొన్నారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ ఆంజనేయ స్వామి ఆలయం ఆవరణలోని దత్తాత్రేయ మందిరంలో దత్తాత్రేయుడికి పంచామృత అభిషేకాలు జరిగాయి. సాయంత్రం భగవద్గీత పారాయణం నిర్వహించారు.

ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోగల లక్ష్మీగణపతి ఆలయ ఆవరణలో దత్తాత్రేయ మందిరంలో ప్రత్యేకపూజలు ఆలయ ఈవో లక్ష్మారెడ్డి పర్యవేక్షణలో జరిగాయి. అంబర్‌పేట నియోజకవర్గంలో పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


డీడీకాలనీలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి తదితరులు


జెమినీకాలనీలో సాయిబాబా ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న ఆలయ కమిటీ నిర్వాహకులు బండారు కౌసల్య, రమేష్‌గౌడ్ తదితరులు


సంజీవయ్యనగర్‌లో స్వామివారికి పూజలు నిర్వహించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, ప్రవీణ్ తదితరులు


ప్రముఖ సంగీత విద్వాంసుడు పోపూరి శ్రీనివాసశర్మను సత్కరించిన పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


రామకృష్ణానగర్ పార్కు, నల్లకుంటలో మొక్కలు నాటుతున్న కార్పొరేటర్‌లు పద్మా వెంకట్‌రెడ్డి, యాకర అమృత

నల్లకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి. పద్మా వెంకట్‌రెడ్డి అన్నారు. వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం డివిజన్‌లోని రామకృష్ణానగర్ పార్కులో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ ఇంటికొక మొక్క నాటాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ బి. వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మోర శ్రీరాములు ముదిరాజ్, చందు, రమేష్ నాయక్, బాలరాజ్, జీహెచ్ఎంసీ హార్టీకల్చర్ అధికారి శ్రీధర్ పాల్గొన్నారు. నల్లకుంట డివిజన్‌లో కార్పొరేటర్ యాకర అమృత మొక్కలు నాటారు. మాజీ కార్పొరేటర్ వనం రమేష్, బీజేపీ నాయకులు ఎం. మధుసూదన్ యాదవ్, పెంటం ధర్మేందర్, మురళి తదితరులు పాల్గొన్నారు.


స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నవీన్ నికోలస్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీపీటీఎల్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నేతలు

ప్రైవేట్ స్కూల్స్‌లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి

నల్లకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని తెలంగాణ ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) కన్వీనర్ ఎ.విజయ్‌కుమార్, భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్, అధ్యక్షుడు కోట రమేష్ డిమాండ్ చేశారు. గురువారం డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ ఇ.నవీన్ నికోలస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్కూల్స్‌కు రెండో శనివారం సెలవు ఇవ్వాలని, ప్రైవేట్ స్కూల్స్‌లో పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించాలని డిమాండ్ చేశారు. నాయకులు కొమ్ము విజయ్, డి.సైదులు, పి.విజయ్, దామెర కిరణ్, హష్మీ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరంలో 200 మందికి పరీక్షలు

ముషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): స్వాంతన చారిటబుల్ ట్రస్ట్, గద్దే రామోజీ ఫౌండేషన్, కిమ్స్ ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బాపూజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి హాజరైన 200 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జీఎస్ చారి, కిమ్స్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ విక్రమ్, నర్సింగ్‌రావు, లావణ్య, లలిత, అమృత, హరిత తదితరులు పాల్గొన్నారు.

సంగమేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్‌గా వెంకటేష్‌గౌడ్

ముషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్‌లో ప్రసిద్ధి చెందిన సంగమేశ్వర దేవాలయ కమిటీ చైర్మన్‌గా బీసీ వెంకటేష్ గౌడ్ నియమితులయ్యారు. గురువారం ఆలయంలో ఆయనచేత ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, దేవాదాయ శాఖ ఈవో లక్ష్మారెడ్డి, ఇన్‌స్పెక్టర్ అండాలు ప్రమాణస్వీకారం చేయించారు. ధర్మకర్తలుగా రజనీకాంత్, రవి, శ్రీనివాస్, లక్ష్మి, వినోద్‌గౌడ్, చంద్రశేఖర్ కూడా ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారిని ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్ సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేవాలయ అభివృద్ధికి అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీగే గ్రేటర్ ఉపాధ్యక్షుడు పాశం అనిల్‌కుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నెల రోజులుగా రోడ్డుపైనే చెత్తాచెదారం



భోలక్‌పూర్ గుల్షన్‌నగర్‌లో రోడ్డుపై నెలరోజుల క్రితం వేసిన చెత్తా చెదారం తొలగించలేదు. దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోయారు. చెత్తాచెదారాన్ని తొలగించాలని కోరుతున్నారు.

- ముషీరాబాద్, ఆంధ్రజ్యోతి

హామీల అమలుకు సీఎం కృషి


రోహిణ్‌రెడ్డిని సత్కరిస్తున్న కృష్ణగౌడ్

రాంనగర్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గౌడ కులస్థులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలుకు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ కృషి చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేట గౌడ సంఘం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన తొలుపునూరి కృష్ణగౌడ్ సంఘం నాయకులతో కలిసి గురువారం డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డిని సత్కరించారు. తమకు పార్టీలో ప్రాధాన్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంపై దాడిచేసిన వారిని శిక్షించాలి

నల్లకుంట, జూలై 10 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ విగ్రహంపై రాళ్లతో దాడిచేసిన వారిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు. లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేడ్కర్ విగ్రహంపై రాళ్లతో దాడిచేసి పారిపోయిన వారిని పట్టుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. గురువారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఇది మంచి పరిణామం కాదన్నారు.

శ్రీ ధర్మవ్యాధుడికి ప్రత్యేక పూజలు

ముషీరాబాద్, జూలై 10 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జమాల్‌పురినందు ఆధ్వర్యంలో లలితానగర్ కమ్యూనిటీ హాల్‌లో గురువారం శ్రీ ధర్మవ్యాధుడి జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు పూసరాజు, ఎమ్మెల్యే ముఠాగోపాల్, బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ రమేష్‌రాం, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.


ఎలక్ట్రికల్ కేబుల్స్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్

బాపూనగర్‌లో ఎలక్ట్రికల్ కేబుల్స్

చిక్కడపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్ బాపూనగర్‌లో ఎలక్ట్రికల్ కేబుల్స్ పనులను కార్పొరేటర్ ఎ. పావనివినయ్‌కుమార్ గురువారం పరిశీలించారు. బస్తీలో ఇళ్ల మధ్యలో ప్రమాదకరంగా వేలాడుతున్న ఎలక్ట్రికల్ వైర్లను తొలగించి కేబుల్ ఏర్పాటు చేయాలని బస్తీవాసులు కార్పొరేటర్‌కు విజ్ఞప్తి చేయగా ఏఈ గోపాలకృష్ణతో మాట్లాడి కేబుల్ ఏర్పాటు చేయించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ సంగీత కచేరీ

చిక్కడపల్లి, జూలై 10 (ఆంధ్రజ్యోతి): కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో ప్రముఖ గాయకుడు డా. పుచ్చా వెంకటరామశాస్త్రి నిర్వహించిన సంగీతానందలహరి విష్ణువైభవం శాస్త్రీయ సంగీత కచేరీ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయనతోపాటు వాద్యసహకారం అందించిన పి. జనార్దన్, కొండపల్లి శ్రీనివాస్‌ను కిన్నెర ఆర్ట్స్ అధినేత మద్దాళి రఘురామ్, మై హోమ్ అవతార్ కల్చరల్ వింగ్ అధినేత రాధాకృష్ణ సన్మానించారు.